

గుట్టురట్టు..

ఏటీఎం కేంద్రాల్లో సాంకేతిక పద్ధతుల్లో దోపిడీకి పాల్పడుతున్న ఉత్తరప్రదేశ్ ముఠాను పోలీసులు గుర్తించారు. ఓ యువకుడిని అరెస్టు చేసి, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. - 8లో



50 ధాన్యం బస్తాలు దగ్ధం

ఇచ్ఛాపురం మండలం బొడ్డబడలో 50 బస్తాల ధాన్యం కాలిబూడిదైంది. పొలంలో ఉన్న విద్యుత్ లైన్‌లో షార్ట్‌సర్క్యూట్ ఏర్పడటమే కారణమని భావిస్తున్నారు. - 8లో

సమస్యలుంటే ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: పౌరసరఫరాలకు సంబంధించి ఎటువంటి సమస్య ఉన్నా రాష్ట్రస్థాయిలో ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1967కు ఫోన్ చేసి వివరించవచ్చని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ బుధవారం తెలిపారు. ధాన్యం కొనుగోళ్లు, లీగల్ మెట్రాలజీ, కన్జూమర్ ప్రొటెక్షన్ తదితర సమస్యలపై ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని పేర్కొన్నారు.

సం(క్రాంతులు



వజ్రపుకొత్తూరు: పూండి పాఠశాలలో హరిదాసు వేషధారణలో బుడతడు



పలాస: బ్రాహ్మణతర్లా హైస్కూల్‌లో సంక్రాంతి సంబరాలు



నరసన్నపేట: రవీంద్రభారతి స్కూల్లో భోగీ మంట వేసి సందడి చేస్తున్న చిన్నారులు



టెక్కలి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

విద్యాలయాలకు ముందుగానే సంక్రాంతి వచ్చేసింది. గురువారం నుంచి సెలవులు ప్రకటించిన నేపథ్యంలో బుధవారమే చిన్నారులంతా సంప్రదాయ వస్త్రాలు ధరించి వేడుకలు జరుపుకొన్నారు. భోగి మంటలు వెలిగించి, హరిదాసు వేషధారణలో అలరించారు. డూడూ బసవన్నలు, జానపద నృత్యాలతో సందడి చేశారు. - సాక్షి నెట్‌వర్క్



కంచిలి: కత్తివరం పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు



చిలకపాలెంలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో..

న్యూస్‌రీల్

ఎంపీడీఓపై విచారణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల పూర్వపు ఎంపీడీఓ ఎం.పావని సస్పెన్షన్‌కు గల కారణాలపై జెడ్పీ సీఈఓ ఆర్.వెంకటరామన్, విచారణ నివేదిక తయారీ అధికారి, టెక్కలి డీపీఎల్‌ఓ అలివేలు మంగమ్మ బుధవారం ఎచ్చెర్ల మండల పరిషత్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. పావనిని గత ఏడాది సెప్టెంబర్ 21న కలెక్టర్ సస్పెండ్ చెయ్యగా, డిసెంబర్ 20న హైకోర్టు ఇచ్చిన స్టే మేరకు తిరిగి విధుల్లోకి తీసుకున్నారు. అనంతరం కొత్తూరు బదిలీ చేశారు. నిబంధనలకు వ్యతిరేకంగా వలంటీర్ల నియామకం, తహశీల్దార్ ఇంటర్వ్యూ బోర్డులో లేకుండానే ఇంటర్వ్యూలు నిర్వహించి నియామకాలు చేపట్టడం , 16 మంది ఎంపీటీసీ సభ్యుల సంతకాలతో ఇచ్చిన పనుల తీర్మానం పరిగణనలోకి తీసుకోకపోవటం, ప్రభుత్వ భవనాల నిర్మాణంలో జాప్యం వంటి కారణాలతో పావనిని సస్పెండ్ చేశారు. తాజాగా సస్పెన్షన్‌కు గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.ఎంపీడీఓ పావనితో పాటు మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు జరుగుళ్ల విజయకుమారి, కుప్పిలి ఎంపీటీసీ సభ్యుడు బల్లాడ జనార్దనరెడ్డి తదితరులు అభిప్రాయాలు సేకరించారు. విచారణ నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు జెడ్పీ సీఈఓ తెలిపారు.

అమ్మానాన్నలు కొడతారని..



సంచారజాతుల చిన్నారులకు అన్నం తినిపిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నిర్మల

ఎల్.ఎన్.పేట: మండలంలోని పెద్దకొల్లివలస పునరావాస కాలనీ సమీపంలో అలికాం-బత్తిలి రోడ్డుపై బుధవారం దారితప్పి వెళుతున్న చిన్నారులను (ఆడపిల్లలు) స్థానికులు జగన్నాథపురం అంగన్‌వాడీ కేంద్రానికి అప్పగించారు. కార్యకర్త జి.నిర్మల వారికి మధ్యాహ్న భోజనం పెట్టిన సమయంలో వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. అయినా సరైన సమాధానం చెప్పకపోవటంతో పిల్లలిద్దరిని పెద్దకొల్లివలస మహిళా పోలీసు ధర్మవరపు రమాదేవి సహాయంతో సరుబుజ్జిలి పోలీసు స్టేషన్‌కు అప్పగించారు. సరుబుజ్జిలి ఎస్సై కె.కృష్ణప్రసాద్ ఆరా తీయగా హిరమండలం పోలీసు స్టేషన్‌లో ఇద్దరు పిల్లలు తప్పిపోయినట్లు కేసు నమోదైందని గుర్తించారు. అంగన్‌వాడీ కార్యకర్త, మహిళా పోలీసు వెళ్లి పిల్లలను హిరమండలం పోలీసులకు అప్పగించారు. వీరిద్దరూ సంచార జాతులకు చెందిన పిల్లలుగా హిరమండలం పోలీసులు తెలిపారు. తల్లిదండ్రులకు ఆరుగురు పిల్లలు ఉన్నట్లు చెప్పారు. అమ్మానాన్నలు సరిగా చూడటంలేదని, కొడతారని, అందుకే బయటకు వెళ్లిపోతున్నామని పిల్లలు పోలీసుల వద్ద తెలిపారు. పిల్లలను సక్రమంగా చూసుకోవాలని హిరమండలం పోలీసులు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ చేసి అప్పగించారు.

మూడు రాజధానులతోనే అభివృద్ధి



లజపతిరాయ్‌తో పాటు జిల్లా అధికారులను సన్మానిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు అభివృద్ధి చెందాలంటే మూడు రాజధానులు తప్పనిసరని రాష్ట్ర వికేంద్రీకరణ నాన్ పొలిటికల్ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ సూర్యతేజ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖను పరిపాలన రాజధానిగా కేటాయించడం ఉత్తమ నిర్ణయమని చెప్పారు. విద్యార్థులు, మేధావులు విశాఖ రాజధాని కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ యూనివర్సిటీ పాలక మండలి సభ్యులు దానేటి పద్మజ, జిల్లా రిజిస్ట్రార్ కె.మన్మథరావు, మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు పూర్వ అధికారి మజ్జి త్రినాథరావు, ఎన్‌జీఓ అధ్యక్షుడు బోనెల గోపాల్, వజ్జ గంగాభవానీ, భారతి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక సెలవు దినాల ప్రకటన

ఇచ్ఛాపురం రూరల్: విశాఖపట్నం సంయుక్త కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు దుకాణాలు, సంస్థలు, ఫ్యాక్టరీలు, ఇతర కర్మాగారాల్లో పని చేస్తున్న కార్మికులకు సెలవు దినాలు ప్రకటించినట్లు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పి.సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 16న కనుమ, 26న గణతంత్ర దినోత్సవం, ఏప్రిల్ 22న రంజాన్, మే 1న మేడే, ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం, సెప్టెంబర్ 18న వినాయకచవితి, అక్టోబర్ 2న గాంధీ జయంతి, నవంబర్ 1న ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం, డిసెంబర్ 25 క్రిస్మస్‌ను కార్మిక సెలవు దినాలుగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. కార్మికులు గమనించాలని కోరారు.

మాటలకందని మహో యువశక్తి



మాటల్లో శక్తి ఉంటే సరిపోదు. చేతల్లో చేవ ఉండాలి. నిర్మాణాత్మక చర్యలుండాలి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక గత మూడున్నరేళ్లలో యువతకు గణనీయమైన ప్రోత్సాహం లభించింది. సచివాలయం వ్యవస్థ ద్వారా ఏకంగా వేలాది మందికి ఉద్యోగాలు ఇవ్వడం మునుపెన్నడూ జరగని అద్భుతం. వివిధ ప్రభుత్వ శాఖల్లోనూ అధికసంఖ్యలో నియామకాలు జరిగాయి. స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాల ద్వారా, జాబ్‌మేళాల ద్వారా, క్రమం తప్పకుండా నియామకాలు జరుగుతున్నాయి. జిల్లాకు ఎన్నడూ లేని విధంగా పోర్టు, ఫిషింగ్ హార్బర్ తదితర ప్రాజెక్టులు వచ్చాయి. యువశక్తికి ఇంత మేలు గతంలో ఎన్నడూ జరగలేదు. యువజనులకు స్థానికంగానే ఉద్యోగాలు ఇచ్చి జీవితంలో స్థిరపడే అవకాశం కల్పించడమే నిజమైన యువశక్తి అనిపించుకుంటుంది.

- యువతీ యువకులకు ఆసరాగా వైఎస్ జగన్ ప్రభుత్వం
- మూడున్నరేళ్లలో అనేక పోస్టులు భర్తీ
- సచివాలయాల్లో వేలాది మంది గ్రాడ్యుయేట్లకు ఉద్యోగాలు
- వైద్యారోగ్య, మత్స్యశాఖలోనూ వరుస నియామకాలు
- గత టీడీపీ పాలనలో పదుల సంఖ్యలోనే పోస్టుల భర్తీ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

'మీకు సాయం చేస్తున్న వారిని మరువకండి. మిమ్మల్ని ప్రేమిస్తున్న వారిని ద్వేషించకండి. మిమ్మల్ని నమ్ముతున్న వారిని మోసం చేయకండి..' స్వామి వివేకానంద మాటలివి. సమకాలీన రాజకీయాల్లో దీన్ని గుర్తు పెట్టుకోవాల్సిన అవసరం ఉంది.

చంద్రబాబు హయాంలో..

'తమకు ఓటేస్తే.. ఇంటికో ఉద్యోగమిస్తా.. నిరుద్యోగులకు ప్రత్యేక భృతి ఇస్తా..' అంటూ 2014 ఎన్నికల్లో అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం ఎన్ని ఉద్యోగాలిచ్చిందో.. ఎంతమందికి భృతి ఇచ్చిందో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసు. దీంతో వేలాది మంది యువత ఇబ్బందులు పడ్డారు.

వైఎస్ జగన్ హయాంలో..

2019లో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి యువతరం ఉద్యోగాల్లో స్థిరపడేలా ప్రణాళికలు అమలు చేస్తున్నారు. సచివాలయ వ్యవస్థ పేరిట అద్భుత పౌరసేవల వ్యవస్థకు నాంది పలికారు. దీంతో ఏకంగా 1.34 లక్షల మంది యువత రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగాలు పొందారు. సాధారణ డిగ్రీలతో పాటు ఇంజినీరింగ్, ఐటీఐ, పాలిటెక్నికల్ డిప్లమో, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం తదితర అర్హతలతో రూల్ ఆఫ్ రిజర్వేషన్, మెరిట్ ప్రాతిపదికనే ఉద్యోగాలు సాధించారు. రోడ్డు రవాణా, వైద్య ఆరోగ్యశాఖ, వ్యవసాయ తదితర శాఖల్లో కూడా వేలాది పోస్టులను భర్తీ చేసింది. ఇవి కాకుండా జాబ్ మేళాలు నిర్వహించి వేలాది మందికి ప్రైవేటు ఉద్యోగాలు కల్పించింది. గ్రూప్స్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తున్న యువతరం కోసం ఏపీపీఎస్సీ నియామకాలు, పోలీస్ శాఖలో భారీ రిక్రూట్‌మెంట్స్‌కు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేయడంతో యువత పరీక్షలకు సిద్ధమవుతోంది.

పంచాయతీరాజ్ శాఖ..



జిల్లాలో మొత్తం 30 మండలాల్లోని సచివాలయాల్లో 6521 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2019 తర్వాత అంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ఈ నియామకాలు జరిగాయి. గ్రామ సచివాలయాల్లో 5880 మందిని, వార్డు సచివాలయాల్లో 641మందిని రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించారు. స్వచ్ఛంద సేవలో భాగంగా 11,083 మంది గ్రామ వలంటీర్లుగా, 1407 మందిని వార్డు వలంటీర్లుగా యువతకు ఉపాధి కల్పించారు.

- గత ప్రభుత్వంలో ఒక్క ఉద్యోగాన్ని కూడా ఇవ్వలేదు. ఔట్ సోర్సింగ్‌లో మాత్రం 16 డేటా ఎంట్రీ ఆపరేటర్ల ఉద్యోగాలిచ్చారు.

ప్రైవేటు కొలువులు..

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చాక అటు ప్రభుత్వ ఉద్యోగాలు కల్పిస్తూనే మరోవైపు ప్రైవేటు కంపెనీలతో సంప్రదింపులు జరిపి జాబ్‌మేళాలు నిర్వహించి, ఉద్యోగాలు కల్పిస్తోంది.
- డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన శాఖ ద్వారా మూడేళ్లలో 4,53 మందికి, సీడాప్ అండ్ డీఆర్‌డీఏ ద్వారా 4497 మందికి ఉద్యోగాలు కల్పించారు.
- ఎచ్చెర్లలో స్కిల్ కాలేజ్ ద్వారా 20 రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తోంది. స్కిల్ హబ్ ద్వారా యువత ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తోంది. నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు నరసన్నపేటలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను నిర్మిస్తోంది.

విద్యుత్ శాఖ..



విద్యుత్ శాఖలో ఎనర్జీ అసిస్టెంట్లుగా 636 మందిని (ఉమ్మడి శ్రీకాకుళం సర్కిల్ పరిధిలో..) నియమించి సచివాలయాల్లో పనిచేసేలా నియమించారు. 20 మందికి షిఫ్ట్ ఆపరేటర్లుగా ఉద్యోగాలు కల్పించారు.

- గత ప్రభుత్వంలో ఇదే శాఖలో 16 మందికి మాత్రమే షిఫ్ట్ ఆపరేటర్ల ఉద్యోగాలు ఇచ్చారు.

యువత విద్యకు పెద్దపీట..

విద్యకు ఈ ప్రభుత్వం పెద్ద పీట వేసింది. స్కూల్స్, కళాశాలలను అందంగా తీర్చిదిద్దడమే కాకుండా పిల్లలు చదువుకునేందుకు సాయం చేస్తోంది. అమ్మ ఒడి, విద్యాదీవెన, వసతిదీవెన కింద ఆర్థిక చేయూతనిస్తోంది. జిల్లాలో ఏటా జగనన్న అమ్మఒడి కింద 2020లో 2,41,562 మందికి రూ.362.34కోట్లు, 2021లో 3,48,331మందికి రూ.487.86కోట్లు చెల్లించింది. 2022లో 2,39,902 మందికి రూ. 359.85కోట్లు అందజేశారు.

కేటగిరి	విద్యా దీవెన (రూ.)	వసతి దీవెన
బీసీ	156.82కోట్లు	103.26కోట్లు
ఈబీసీ	6.23కోట్లు	3.32కోట్లు
ఎస్సీ	310.56కోట్లు	115.00కోట్లు

వైద్య ఆరోగ్యశాఖ..



వైద్యారోగ్య శాఖలో వైద్యుల పోస్టులు కాకుండా కేవలం పారా మెడికల్ విభాగంలోనే 1470 మందికి ఉద్యోగాలు ఇచ్చారు. రిమ్స్‌తో పాటు వివిధ ప్రభుత్వ ఆసుపత్రుల్లో 88 మంది వైద్యుల పోస్టులు భర్తీ చేశారు. క్షేత్ర స్థాయిలో పీహెచ్‌సీలు, సీహెచ్‌సీల్లో గ్రేడ్-3 ఏఎన్‌ఎంలుగా 606 మందిని , ఎంఎల్‌హెచ్‌పీగా 586 మందిని, డాక్టర్ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్‌లో స్టాఫ్ నర్సులుగా 31 మందిని, లాస్ట్ గ్రేడ్ సర్వీసెస్ ఉద్యోగాల్లో ఆరుగురిని నియమించారు. కంబైన్డ్ నోటిఫికేషన్ కింద పారామెడికల్ స్టాఫ్ మొత్తం 143 మందిని నియమించారు. ఫార్మసిస్టులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరత్రా పోస్టుల్లో 98 మందిని నియమించారు. ఇవన్నీ 2020-21 నుంచి ఇప్పటివరకు నియామకాలు జరిగినవే.

- గత ప్రభుత్వం హయాంలో కేవలం 168 పారామెడికల్ పోస్టులను భర్తీ చేసినట్లు సమాచారం.

మత్స్యశాఖ



మత్స్యశాఖలో కూడా సచివాలయాల్లో పని చేసేలా 54 మందిని విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లను నియమించింది. తీర ప్రాంతాల్లో మత్స్యకారుల జీవన ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా, ప్రభుత్వ పథకాల అమలును పరిశీలించేలా 'సాగరమిత్ర' పేరిట 53 మందిని నియమించారు.

- ఇదే గత ప్రభుత్వం ఐదేళ్లలో మల్టీపర్పస్ ఫిషరీస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్స్ పేరిట 20 మందికి కాంట్రాక్ట్ ఉద్యోగాలిచ్చారు.

ఉన్నత విద్యకు భరోసా..

జిల్లాలోని విద్యార్థులకు ఉన్నత విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. అనేక విద్యా సంస్థలను కొత్తగా మంజూరు చేసింది.

- సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో వెటర్నరీ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేశారు. తాత్కాలిక క్లాసులు ధన్నానపేట ప్రభుత్వ పాలిటెక్నికల్ కళాశాలలో నిర్వహిస్తున్నారు. కొత్త భవనానికి భూకేటాయింపులు పూర్తయ్యాయి.
- ఆమదాలవలస మండలం తొగరాంలో అగ్రికల్చరల్ పాలిటెక్నికల్ కళాశాల మంజూరు చేసి తరగతులు కూడా ప్రారంభించారు.
- బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేయగా పనులు ప్రారంభమయ్యాయి.
- పొందూరు, తొగరాం, పలాసలో డిగ్రీ కళాశాలలు, సరుబుజ్జిలి మండలం రొట్టవలసలో బాలికల జూనియర్ కళాశాలలు మంజూరు చేశారు. తరగతులు ప్రారంభమయ్యాయి.
- బూర్జ మండలం పెద్దపేటలో హార్టికల్చర్ రీసెర్చ్ స్టేషన్ మంజూరు చేశారు. పనులు ప్రారంభమయ్యాయి.

పరిశ్రమలకు ప్రోత్సాహం

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహిస్తూ ఎక్కడికక్కడ ఎంఎస్ఎంఈ యూనిట్లను ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం కీలక పాత్ర పోషించింది. 2019 నుంచి ఇప్పటి వరకు 2523 యూనిట్లు ఏర్పాటు చేసి 14135 మందికి కొత్తగా ఉద్యోగాలు వచ్చేలా చేసింది. మరో మూడు భారీ, చిన్న తరహా పరిశ్రమలను ప్రోత్సహించి వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించింది.

43,797 మందికి జగనన్న తోడు



లబ్ధిదారులకు చెక్ అందజేస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే రెడ్డిశాంతి, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ తదితరులు

- జిల్లాలో రూ.16.85 కోట్లు అందజేత
- వర్చువల్ కార్యక్రమానికి హాజరైన మంత్రి ధర్మాన, కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: చిరు వ్యాపారులకు జగనన్న తోడు రుణం ఆసరాగా నిలుస్తుందని ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం జగనన్న తోడు రుణాల పంపిణీ, లబ్ధిదారుల కు వడ్డీ జమ కార్యక్రమంలో భాగంగా వర్చువల్ విధానంలో లబ్ధిదారుల ఖాతాల్లో నగదు జమ చేశారు.

- కలెక్టరేట్‌లో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ జగనన్న తోడు పథకంతో చిరు వ్యాపారులకు మేలు జరుగుతుందన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో రుణాల పంపిణీ, లబ్ధిదారులకు వడ్డీ అందిస్తున్నట్లు వెల్లడించారు. అర్హులందరికీ పథకాలు అందుతాయని చెప్పారు.
- కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ మాట్లాడుతూ జిల్లాలో బ్యాంకు ద్వారా రుణం పొందిన 27,521 మంది లబ్ధిదారులకు రూ.58 లక్షల మేర వడ్డీ వచ్చినట్లు వివరించారు. జిల్లాలో 43,797 మందికి రూ.16.85 కోట్ల మేర జగనన్న రుణాలు మంజూరు చేసినట్లు వెల్లడించారు. అనంతరం లబ్ధిదారులకు నమూనా చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డీసీసీబీ అధ్యక్షుడు కరిమి రాజేశ్వరరావు, కళింగ వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు, కేంద్ర మాజీ మంత్రి కిల్లి కృపారాణి, డీఆర్‌డీఏ పీడీ విద్యాసాగర్, మెప్మా పీడీ కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాల వ్యాపారం చేస్తున్నాను..



గతంలో ఒక ఆవు మాత్రమే ఉండేది. జగనన్న తోడు పథకం రుణం అందడంతో రెండు ఆవులు కొనుక్కొని పాల వ్యాపారం చేసుకుంటున్నాను. రోజుకు పది లీటర్ల పాలు అమ్ముతున్నాను. జగనన్న తోడు రణంతో మేలు జరిగింది. సీఎం సాయానికి రుణపడి ఉంటాను.

– సాధు సుగుణ, ఖాజీపేట, శ్రీకాకుళం

ఆర్థిక భరోసా..



మాది కూరగాయల వ్యాపారం. గతంలో వ్యాపారం కోసం అప్పు చేయాల్సి వచ్చేది. ప్రస్తుతం జగనన్న తోడు రుణంతో అప్పు భారం తప్పింది. కూరగాయల వ్యాపారంతో రోజుకు రూ.500 వరకు సంపాదించి కుటుంబాన్ని పోషించుకుంటున్నాం. ఈ పథకంలో మహిళలకు ఆర్థిక భరోసా కలుగుతోంది.

– నడగాన భారతి, సింగుపురం, శ్రీకాకుళం

కళలకు పుట్టినిల్లు ఉద్దానం

- సిక్కోలు జానపద కళాజాతరలో మంత్రి సీదిరి అప్పలరాజు
- ఆటపాటలతో అలరించిన ప్రజాగాయకుడు గద్దర్



ప్రజాగాయకుడు గద్దర్‌కు సన్మానం చేసి జ్ఞాపిక అందజేస్తున్న మంత్రి డాక్టరు సీదిరి అప్పలరాజు

పలాస: కళలకు పుట్టినిల్లుగా పేరుగాంచిన ఉద్దానంలో జానపదుల ఆటాపాటలతో ముందుగానే సంక్రాంతి వచ్చిందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస మండలం చిన్ననీలావతి గ్రామంలో బుధవారం సిక్కోలు జానపద కళాజాతర అంగరంగ వైభవంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి జానపద కళాకారులు పాల్గొని ప్రదర్శనలతో అలరించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి అప్పలరాజు కళాకారులతో మమేకమై పాటపాడి ప్రేక్షకులను అలరింపజేశారు. ఇటువంటి ప్రాంతంలో జన్మించడం ఎంతో గర్వకారణమని చెప్పారు. ఈ గడ్డపై పుట్టిన ఎంతో మంది వీరులు ప్రజల కోసం ప్రాణత్యాగాలను చేశారని గుర్తు చేశారు. కొంతమంది కలం పట్టి, మరి కొంత మంది పెన్నూ గన్నూ పట్టి పోరాటం చేశారని కొనియాడారు. ప్రజాగాయకుడు గద్దర్ సమసమాజం కోసం పోరాడిన అమరవీరులకు సాష్టాంగ వందనం చేశారు. అనంతరం కుల వ్యవస్థపై స్థానిక కళాకారులతో కలసి నృత్య ప్రదర్శన చేశారు. జానపదమంటే జ్ఞానమని, అభ్యుదయమని, కళలను కాపాడుకోవాలని కళాకారులకు హితబోధ చేశారు. జిల్లాకు చెందిన ప్రజా గాయకుడు వంగపండు ప్రసాద్‌తో తన కున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఇక్కడి కవులు రాసిన పాటలు ఉద్యమానికి ఊపిరి పోశాయని చెప్పారు. అనంతరం తెలంగాణ ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, రాష్ట్ర క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ చైర్‌పర్సన్ వంగపండు ఉష, పలువురు కళాకారులు అద్భుత ప్రదర్శనతో ఉర్రూతలూగించారు.



జానపద కళారూపాల ప్రదర్శన

క్లుప్తంగా

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వజ్రపుకొత్తూరు: పూండి రైల్వే స్టేషన్‌కు సమీపంలో పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించినట్లు పలాస జీఆర్‌పీ ఎస్సై ఎస్‌కే షరీఫ్ బుధవారం తెలిపారు. మంగళవారం రాత్రి వ్యక్తి చనిపోయి ఉండవచ్చునని భావిస్తున్నామన్నారు. మృతుడు ఛామనఛాయ రంగు కలిగి శరీరంపై సిమెంట్ కలర్ టీ షర్టు, పువ్వులతో ఉన్న లుంగీ, టవల్ ఉన్నట్టు చెప్పారు. కాగా మృతుడు నందిగాం మండలం నౌగాం గ్రామానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించామన్నారు. పూండి రైల్వేస్టేషన్ మాస్టర్ నీలమణి ఫాడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

కరోనా బాధిత పోలీసు కుటుంబాలకు సాయం


మహేష్ భార్య శైలజకు చెక్ అందజేస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైమ్ : హోంగార్డుగా పనిచేసిన జి.మహేష్ విధి నిర్వహణలో కోవిడ్ సోకి మరణించారు. ఆయన కుటుంబానికి మానవతా దృక్పథంతో మ్యాన్ కైండ్ ఫార్మా సంస్థ అందించిన రూ.3లక్షల చెక్కును ఎస్పీ జి.ఆర్.రాధిక బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కోవిడ్ మొదటి, రెండో దశల్లో ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన పోలీసుల కుటుంబాలకు ఆర్థిక చేయూతనందించే లక్ష్యంతో పనిచేస్తున్న మ్యాన్‌కైండ్ ఫార్మా సంస్థను అభినందించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ టి.పి.విఠలేశ్వరరావు, ఏఓ శివరామ రాజు, బాధిత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

50 ధాన్యం బస్తాలు దగ్ధం

ఇచ్ఛాపురం రూరల్: ఆరుగాలం శ్రమించి, భద్రపరిచిన ధాన్యం అగ్నికి ఆహుతైన ఘటన బుధవారం రాత్రి ఇచ్ఛాపురం మండలం బొడ్డబడలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన సోనియా బెహరా తాను పండించిన ధాన్యాన్ని బస్తాల్లో నింపి ఇంటి సమీపంలోని పొలంలో భద్రపరిచాడు. బుధవారం రాత్రి ఒక్కసారిగా బస్తాలకు మంటలు వ్యాపించడంతో స్థానికులు స్పందించి సుమారు 200 ధాన్యం బస్తాలను కాపాడారు. ఈ ఘటనలో 50 బస్తాల వరకు కాలిబూడిదయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటల్ని అదుపులోకి తెచ్చారు. విషయం తెలుసుకున్న ఉప తహశీల్దార్ సదాశివుని గురుప్రసాద్, ఆర్‌ఐ శ్రవణ్‌కుమార్‌ను సంఘటన స్థలానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పంట పొలానికి ఆనుకొని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఉండటంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడి నిప్పురవ్వలు వరిగడ్డిపై పడి ధాన్యం బస్తాలు మంటల్లో చిక్కుకుని ఉండవచ్చని స్థానికులు చెబుతున్నారు.

గుట్టురట్టు..




పోలీసులు అరెస్టు చేసిన విశాల్ సింగ్

- ఏటీఎం యంత్రం నుంచి సాంకేతిక పరిజ్ఞానంతో నగదు తస్కరించిన ఉత్తరప్రదేశ్ యువకుడు అరెస్టు
- మరో ముగ్గురి కోసం పోలీసుల గాలింపు
- వివరాలు వెల్లడించిన సీఐ సన్యాసినాయుడు

శ్రీకాకుళం క్రైమ్: శ్రీకాకుళం నగరంలోని పలు బ్యాంకు ఏటీఎం యంత్రం నుంచి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి నగదు తస్కరించిన ముఠా గుట్టురట్టయింది. పోలీసులు వలపన్ని ఒకరిని పట్టుకొని కటకటాల వెనక్కి నెట్టారు. ఈ ఘటనలతో సంబంధం ఉన్న మరో ముగ్గురి కోసం గాలిస్తున్నారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదుతో అప్రమత్తమైన పోలీసులు ఏటీఎం యంత్రం నుంచి నగదు చోరీకి పాల్పడిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన విశాల్‌సింగ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు శ్రీకాకుళం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ సీఐ ఎల్.న్యాసినాయుడు బుధవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ కాన్పూర్‌కు చెందిన విశాల్‌సింగ్‌తోపాటు మరో ముగ్గురు కలిసి జీటీరోడ్డు, ఓల్డ్ బ్రిడ్జి, హయాతీనగరం, బలగ సాయిసదన్, ఉమెన్స్ కాలేజీ, కలెక్టరేట్‌ల వద్ద ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం మెషీన్ల నుంచి రూ. 6 లక్షలు కాజేసినట్లు అరెస్టయిన యువకుడు అంగీకరించినట్టు పేర్కొన్నారు. ఈ నలుగురితోపాటు ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ ముఠా జిల్లా వ్యాప్తంగా 83 బ్యాంకు ఖాతాల నుంచి 415 సార్లు లావాదేవీలు జరిపి మొత్తం రూ. 65.94 లక్షలు వివిధ ఏటీఎంల నుంచి నగదును కాజేసినట్టు సీఐ వివరించారు. మొత్తం ముఠా ఆచూకీని కూడా త్వరలో ఛేదిస్తామన్నారు. గత ఏడాది నవంబర్ 14న శ్రీకాకుళంలోని స్టేట్ బ్యాంక్ మెయిన్ బ్రాంచ్‌లో ఆడిట్ లెక్కల్లో డబ్బులు తేడా రావడంతో అప్రమత్తమైన మేనేజర్ ఒకటో, రెండో పట్టణ పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కేసునమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తులో భాగంగా ఏటీఎం మెషీన్ల వద్ద ఉండే సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పసిగట్టారు. వీరు ఆగస్టు ఐదో తేదీన జిల్లాలోకి చొరబడి నాలుగు రోజులు లాడ్జీల్లో ఉన్నట్టు తెలుసుకున్నారు. ఆ తేదీల్లో బ్యాంకు ఖాతాల వివరాలు పరిశీలించగా.. అన్నీ ఉత్తరప్రదేశ్‌కు చెందిన బ్యాంకు ఖాతాలుగా గుర్తించారు. బ్యాంకు ఖాతాల కేవైసీ వివరాలు, ఫోన్ నంబర్ల ఆధారంగా వారి కాల్‌డేటా లిస్టు, డంప్ కాల్స్ సేకరించారు. వీటన్నింటి ఆధారంగా ఆ తేదీల్లో పవర్ లొకేషన్ కూడా శ్రీకాకుళం అని చూపడంతో ఇదంతా చేసింది ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ అని తెలుసుకున్నామని సీఐ పేర్కొన్నారు.

ఎక్కడ పట్టుకున్నారంటే..

పండుగ సీజన్ కావడంతో నలుగురు యువకుల్లో ఒకడైన విశాల్‌సింగ్ మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఇదే తరహాలో నగదును కాజేయడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుసుకున్న పోలీసులు అప్రమత్తమయ్యారు. నగరంలోని శ్రీనివాసా లాడ్జీలో స్టే చేసినట్టు సమాచారం రావడంతో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ బలివాడ గణేష్‌లతో కూడిన బృందం దాడిచేసి అతన్ని అరెస్టు చేశారు.

చోరీ ఎలా చేశారంటే..

గత ఏడాది ఆగస్టు ఐదో తేదీన జిల్లాలోకి ప్రవేశించిన నలుగురు యువకులు పట్టణంలోని పలు ఎస్‌బీఐ ఏటీఎం కేంద్రాల్లోకి చొరబడి.. వరుసగా నిలబడి ఏడు నిమిషాల పాటు వారి ఆధీనంలో యంత్రాన్ని ఉంచుకొని.. ఖరాబు చేసేవారు. మెషీన్‌లో ఏటీఎం కార్డు పెట్టడం, నగదు డీటైల్స్, పిన్ నంబర్ ఎంటర్ చేశాక యువర్ ట్రాన్సెక్షన్ ఈజ్ బీయింగ్ ప్రాసెసింగ్ అనే వర్డ్ వచ్చాక వారికి తెలిసిన టెక్నాలజీ వాడుకుని యంత్రంను ఖరాబు చేసేవారు. ఈలోగా యంత్రంలో క్యాష్ వచ్చేసేది. తరువాత మెషీన్ మాత్రం ఔట్ ఆఫ్ సర్వీస్ అని చూపేది. బ్యాంక్ అథారిటీ వారికి డబ్బులు డ్రా అయినట్లు కనిపించేది కాదు. వెంటనే వీరే ఆన్‌లైన్‌లో బ్యాంకు వారికి తమ ఖాతాల నుంచి అమౌంట్‌ను డ్రా చేస్తే అవ్వలేదని.. రీఫండ్ చేయాలని ఫిర్యాదు చేసేవారు. తప్పని పరిస్థితుల్లో ఎస్‌బీఐ మెయిన్ కంట్రోలింగ్ సెంటర్ నుంచి మూడు రోజుల్లో ఆన్‌లైన్ ఫిర్యాదుకు సమాధానం ఇవ్వాల్సి వచ్చేది. ఆటోమెటిక్‌గా అమౌంట్ కూడా వారికి డెబిట్ అయ్యేది. ఇలా నాలుగు రోజులు పట్టణంలోని వివిధ ఏటీఎంల్లో తమ సాంకేతిక పరిజ్ఞానంతో రూ. 6 లక్షల వరకు దోచుకున్నారు. ఇదే తరహాలో ఉత్తరప్రదేశ్ గ్యాంగ్ జిల్లా వ్యాప్తంగా రూ. 65.94 లక్షలు దోచుకున్నారని సీఐ చెప్పారు.

రూ. 4.24 లక్షల విలువైన పీడీఎస్ బియ్యం పట్టివేత

- పది మందిపై కేసు నమోదు
- మూడు ఆటోలు, వ్యాన్ సీజ్


విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలు

కొత్తూరు: శ్రీకాకుళం రీజియన్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు కొత్తూరు మండలంలో బుధవారం మెరుపు దాడులు చేసి రూ. 4.24 లక్షల విలువైన పీడీఎస్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేశారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు ఆదేశాల మేరకు విజిలెన్స్ సీఐలు అప్పలనాయుడు, సింహాచలం, హెచ్‌సీలు అప్పన్న, రామ్మోహన్, ఉమాలు మాతల వంశధార బ్రిడ్జి వద్దకు మంగళవారం రాత్రి చేరుకున్నారు. బియ్యం అక్రమ రవాణపై ముందస్తు సమాచారం ఉండడంతో రాత్రింతా అక్కడే మాటువేశారు. కొత్తూరు నుంచి ఒడిశా రాష్ట్రం హద్దుబంగి గ్రామానికి మూడు ఆటోలు, ఒక వ్యాన్‌తో 8.60 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తుండగా అధికారులు పట్టుకున్నారు. అలాగే బమ్మిడిలోని ఓ ఇంటిలో అక్రమంగా నిల్వ ఉంచిన 2.60 టన్నుల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 11 టన్నుల రెండు వందల కేజీల బియ్యాన్ని స్వాధీనం చేసుకోగా.. వీటి విలువ రూ.4.24 లక్షలు ఉంటుందని విజిలెన్స్ అధికారులు చెప్పారు. బియ్యాన్ని కొత్తూరు సివిల్ సప్లై డీటీ రౌతు రవికుమార్, ఇన్‌చార్జి ఆర్ఐ గిరిష్ పట్నాయక్‌లకు విజిలెన్స్ అధికారులు అప్పగించగా.. వారు స్థానిక ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలించారు. దాడుల్లో ఆర్ఐ గిరిష్ పట్నాయక్, వీఆర్వో తోట సత్యన్నారాయణలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బియ్యాన్ని రవాణా చేసేందుకు వినియోగించిన మూడు ఆటోలు, ఒక వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నామని, పదిమందిపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

అదనపు చార్జీలు వసూలు చేస్తే చర్యలు


ఆదివారంపేట జంక్షన్ వద్ద వాహన పత్రాలను తనిఖీ చేస్తున్న ఆర్టీఓ అధికారులు

శ్రీకాకుళం రూరల్: ప్రైవేట్ ట్రావెల్స్‌బస్సులు, ట్యాక్సీలు, క్యాబ్‌లు పండగ పర్వదినాల్లో ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ సీహెచ్ శ్రీదేవి హెచ్చరించారు. బుధవారం డీటీసీ కార్యాలయంలో ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు డీలర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం పలు కూడళ్లలో వాహనాల పత్రాలు తనిఖీ చేశారు. చార్జీలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండగ రోజుల్లో ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని చెప్పారు.

శ్రీముఖలింగం క్షేత్రానికి యునిసెఫ్ గుర్తింపునకు కృషి


ఢిల్లీ సమావేశంలో శ్రీకాకుళం ఇంటాక్ సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీముఖలింగం క్షేత్రాన్ని పురాతన సందర్శన ప్రదేశంగా యునిసెఫ్ గుర్తించేలా కృషి చేస్తున్నామని శ్రీకాకుళం ఇంటాక్ సభ్యులు తెలిపారు. ఈ నెల తొమ్మిది నుంచి 11వ తేదీ వరకు న్యూఢిల్లీలోని భారత జాతీయ కళలు, సంస్కృతిక వారసత్వ సంస్థ (ఇంటాక్) ప్రధాన కార్యాలయంలో దేశంలోని వివిధ చాప్టర్లతో సమావేశం జరిగింది. ఇందులో శ్రీకాకుళం ఇంటాక్ నుంచి చాప్టర్ కన్వీనర్ నూక సన్యాసిరావు, అదనపు కన్వీనర్లు వావిలపల్లి జగన్నాథం నాయుడు, నటుకుల మోహన్ పాల్గొన్నారు. అక్కడి సమావేశంలో జరిగిన అంశాలను బుధవారం వివరించారు. ఢిల్లీ సమావేశంలో శ్రీకాకుళం చాప్టర్ ద్వారా గత ఏడాది కాలంలో నిర్వహించిన కార్యక్రమాలను వెల్లడించామన్నారు. తమ కార్యక్రమాల పట్ల ఇంటాక్ చాప్టర్స్ డివిజన్ సంచాలకులు కెప్టెన్ అరవింద్ శుక్లా ప్రశంసించారన్నారు. వినూత్న కార్యక్రమాల నిర్వహణకు ప్రతిపాదనలు పంపిస్తే ఆమోదిస్తామని హామీ ఇచ్చినట్టు పేర్కొన్నారు. సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించుకునేందుకు కార్యశాలలో ఏర్పాటు చేసిన సలహా గ్రూపుల్లో పాల్గొన్నట్టు చెప్పారు. శ్రీముఖలింగ క్షేత్రాన్ని పురాతన సందర్శనా ప్రదేశంగా యునిసెఫ్ గుర్తించేందుకు ప్రయత్నించాలని ఇంటాక్ కేంద్ర కార్యాలయం ప్రతినిధులను కోరామన్నారు. ప్రాచీన కళాకృతులను పరిశీలించామన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం

- సీనియర్ సివిల్ జడ్జి సన్యాసినాయుడు


మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: మహిళలకు చట్టాలపై అవగాహన అవసరమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. ఎచ్చెర్ల టీటీడీసీలో నిర్వహిస్తున్న స్కిల్ కళాశాలలో, మహిళా ప్రాంగణంలో న్యాయ విజ్ఞాన సదస్సులను బుధవారం నిర్వహించి.. మహిళల చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మానవ అక్రమరవాణా, పోక్సో, బాల కార్మిక వ్యవస్థ వంటి చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి మహిళ తమకాళ్లపై సొంతంగా జీవించేలా ముందుకు సాగాలన్నారు. సంక్షేమ పథకాలు, ప్రభుత్వం అందజేస్తున్న శిక్షణలతో ఆర్థిక ప్రగతి సాధించాలని సూచించారు. న్యాయపరంగా ఇబ్బందులు ఉంటే జిల్లా న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయం పొందాలని సూచించారు. చట్టం దృష్టిలో అందరూ సమానమేనన్నారు. పేదవారికి ప్రభుత్వాలు అండగా ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది ఇందిరా ప్రసాద్, సోషల్ వర్కర్ మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

టెక్కలి: జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో ఇటీవల రాజాం జీఎంఆర్ఐటీ కళాశాలలో నిర్వహించిన ఇంటర్ కాలేజ్ వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. తమ కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు బంగారు పతకాలు సాధించారని డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. 55 కిలోల విభాగంలో బిర్లంగి రాజశేఖర్, 86 కేజీల విభాగంలో కె.వినోద్‌కుమార్ బంగారు పతకాలు దక్కించుకున్నారన్నారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకుడు పి.మురళీధర్, కోచ్ వెంకటేష్, పీడీలు ఎస్. లక్ష్మణమూర్తి, టి.మురళీమోహన్, జె.తేజేశ్వరి విద్యార్థులను అభినందించారు.

తైక్వాండో క్రీడాకారులకు అభినందన


పతకాలు సాధించిన తైక్వాండో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: తైక్వాండో క్రీడాకారులు జిల్లా పేరు ప్రతిష్టలు నిలబెట్టడంతో పాటు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని సీనియర్ న్యాయవాది నౌపాడ విజయకుమార్ అన్నారు. హైదరాబాద్‌లోని యూసఫ్‌గూడలో ఉన్న కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో ఈ నెల ఆరు నుంచి ఎనిమిదో తేదీ వరకు జరిగిన ఫస్ట్ సౌత్ ఇండియా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు పాల్గొని సత్తాచాటారు. దీంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో 35 మంది క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన జిల్లా క్రీడాకారుల ఖిల్లా అన్నారు. చాలామంది రాష్ట్ర, దేశ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని.. వారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జి.వెంకటేశ్వరరావు, ఎం.సుధీర్‌వర్మ, కెల్ల చిన్ని, ఎస్.గోవిదరాజులనాయుడు ఉన్నారు.

● విజయమే లక్ష్యం


పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డిశాంతి కాసేపు బ్యాట్ చేతపట్టి క్రికెట్ ఆడారు. కొత్తూరులో గోగుల చల్లంనాయుడు జ్ఞాపికార్థం ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌లో బ్యాటింగ్ చేసి పోటీలను ప్రారంభించారు.

– కొత్తూరు

● తిరువీధి ఉత్సవం



శ్రీకూర్మనాథాలయంలో వారం రోజులుగా జరుగుతున్న అధ్యయనోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి తిరువీధి ఉత్సవం నిర్వహించారు. శ్రీదేవి భూదేవి సమేత గోవిందరాజస్వామి ఉత్సవమూర్తులను మాడ వీధుల్లో ఊరేగించారు. ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు, స్థానాచార్యులు శ్రీభాష్యం పద్మనాభాచార్యులు, కిషోర్‌బాబులు పూజలు నిర్వహించగా, ఈఓ జి.గురునాథం, పాలకమండలి సభ్యుడు డబ్బీరు వాసుదేవరావు పాల్గొన్నారు.

– గార

● మహా నైవేద్యం


సారవకోట మండలం చీడిపూడి వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం భక్తిశ్రద్ధలతో కుడారై మహా ప్రసాద సేవ నిర్వహించారు. ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ఏర్పాటు చేసి 108 పాత్రలలో నైవేద్యం సమర్పించి విశేష పూజలు చేశారు.

– సారవకోట

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	54,930–00
బంగారం(22సి. 10గ్రా.)	50,350–00
వెండి (కిలో)	74,500–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹125	₹205	₹ 225

తొమ్మిది మంది జూదరుల అరెస్టు

కంచిలి: మండలంలోని జాడుపూడి ప్రాథమికోన్నత పాఠశాల వెనుక తోటషెడ్డులో జరుగుతున్న పేకాట శిబిరంపై కంచిలి పోలీసులు బుధవారం దాడి చేశారు. తొమ్మిది మందిని అరెస్టు చేసి రూ.76,390 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎస్.చిరంజీవి తెలిపారు.

నిర్లక్ష్యంగా పనిచేస్తే సస్పెన్షన్ తప్పదు

శ్రీకాకుళం పాతబస్టాండ్:

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై సస్పెన్షన్‌కు ఎంపీడీఓలు సిఫారసు చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ చిట్టిరాజు సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీడీఓలు, ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సగటు వేతనం రూ. 250కి తగ్గితే సహించేది లేదన్నారు. జెడ్పీ సీఈవో ఆర్.వెంకట్రామన్ మాట్లాడుతూ ఎంపీడీఓలు, ఉపాధి హామీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలన్నారు. విజిలెన్స్ అధికారి బి.లవరాజు మాట్లాడుతూ లక్ష్య సాధనకు సహకరించని సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో కార్యక్రమ అధికారి కె.వి.అప్పలనాయుడు, ఫైనాన్స్ మేనేజర్ స్వరూపరాణి, ఏపీడీలు మురళీకృష్ణ, శైలజ, లోకేష్, హరిత, జయరాం తదితరులు పాల్గొన్నారు.

47 వేల లీటర్ల బెల్లం ఊట ధ్వంసం


స్వాధీనం చేసుకున్న డ్రమ్ముల వద్ద సిబ్బంది

మెళియాపుట్టి: ఒడిశా ఆంధ్రా సరిహద్దులోని గొప్పిలి తదితర గ్రామాల పరిధిలో బుధవారం శ్రీకాకుళం ఎస్ఈబీ అసిస్టెంట్ కమిషనర్ గోపాల్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. 47 వేల లీటర్ల బెల్లం ఊట, 1200 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. సారా తయారుచేసినా, విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ దాడుల్లో టెక్కలి, శ్రీకాకుళం సిబ్బందితో పాటు ఒడిశా సిబ్బంది పాల్గొన్నారు.

లైన్ దాటి ముందుకు రావొద్దు

- అరసవల్లి ఆలయ ప్రధాన మార్గంలో మార్కింగ్ వేయించిన పోలీసులు


ప్రధాన రోడ్డు ఇరువైపులా మార్కింగ్ వేస్తున్న దృశ్యం

అరసవల్లి: నిత్యం భక్తులు, వీవీపీల తాకిడితో రద్దీగా ఉండే అరసవల్లి సూర్యనారాయణ స్వామి వారి ఆలయ ప్రధాన ఆర్చిగేటు నుంచి ఆలయం వరకు ఉన్న ప్రధాన మార్గంలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా పోలీసులు చర్యలు చేపట్టారు. వీవీపీల రాకపోకల్లో ఇటీవల జరిగిన పలు ఘటనల నేపథ్యంలో అప్రమత్తమైన ఆలయ అధికారులు, పోలీసులు తగిన ఆంక్షలు విధించి మార్కింగ్ వేయించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వ్యాపారులు మార్కింగ్ దాటి ముందుకు రావొద్దంటూ టౌన్ ఎస్సై బలివాడ గణేష్ ఆదేశించారు. వ్యాపారులంతా ఈ నియమాన్ని కచ్చితంగా పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేశారు.

పుస్తెలతాడు చోరీ

సారవకోట: మండలంలోని సవరడ్డపనస గ్రామానికి చెందిన కింజరాపు అమ్ములమ్మ(72) మెడలోని పుస్తెలతాడు చోరీకి గురైంది. వృద్ధురాలు బుధవారం ఉదయం సవరడ్డపనస నుంచి చల్లవానిపేటకు కిరాణా సరుకుల కోసం వెళ్లింది. తిరిగి సారవకోట వైపు వెళ్తున్న ఆటో ఎక్కింది. అప్పటికే ఆటోలో ఇద్దరు మహిళలున్నారు. వారు చాకచక్యంగా వృద్ధురాలి మెడలో పుస్తెలతాడు చోరీ చేశారు. అడ్డపనస పాఠశాల వద్ద వృద్ధురాలు దిగిన తర్వాత మెడలో ఉన్న పుస్తెలతాడు పూసలు జారిపోవడాన్ని గమనించింది. పుస్తెలతాడు చోరీకి గురైందని గమనించి కుటుంబ సభ్యులతో కలిసి సారవకోట పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసింది. పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశామని ఎస్ఐ బి.లావణ్య తెలిపారు.

నిందితుడు అరెస్టు

శ్రీకాకుళం క్రైమ్ : గార మండలం దీపావళిలో ఈ నెల 6న ఎనిమిదేళ్ల బాలికపై అత్యాచారానికి పాల్పడిన 59 ఏళ్ల వృద్ధుడు సూర్యనారాయణ(59)ను శ్రీకాకుళం దిశా మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ వాసుదేవ్ పోక్సో కేసు కింద అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎచ్చెర్ల మండలం పెద్దకొంగరాం గ్రామానికి చెందిన సూర్యనారాయణకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య మూడేళ్ల క్రితం చనిపోయింది. ఇద్దరు కుమార్తెలకు గార మండలం దీపావళి గ్రామానికి చెందిన వారితో ఇదివరకే వివాహం చేశాడు. కొంత కాలంగా గుజరాత్‌లో వీరావలిలో కూలిపనులు చేసుకుంటూ జీవనం సాగించి ఇటీవలే గ్రామానికి వచ్చి ఈ నెల 6న కుమార్తెను చూడడానికి దీపావళి వెళ్లాడు. ఇంట్లో వాళ్లంతా బయటకు వెళ్లిపోవడంతో పక్క వీధికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. గార ఎస్ఐ మధుసూదనరావు కేసు నమోదు చేయడంతో మంగళవారం నిందితున్ని అదుపులోకి తీసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు.

పాస్‌ల కోసం వాగ్వాదం

లావేరు: జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ నేతృత్వంలో గురువారం లావేరు మండలం తాళ్లవలస వద్ద జరగనున్న సభకు సంబంధించి వీఐపీ పాస్‌ల కోసం బుధవారం ఆ పార్టీ నేతల్లో వాగ్వాదం జరిగింది. ఎచ్చెర్ల నియోజకవర్గానికి జనసేన ఇన్‌చార్జి లేకపోవడంతో ఎచ్చెర్ల జనసేన నాయకులుగా చెప్పుకుంటున్న సయ్యద్‌క్రాంతిశ్రీ, బాడాన జనార్దన్ వర్గీయులు పాస్‌లు కోసం సభావేదిక వద్దే ఘర్షణ పడి కేకలు వేసుకున్నారు. అక్కడ ఉన్న పార్టీ ముఖ్య నాయకులు ఇరువర్గీయులను నచ్చచెప్పి అక్కడ నుంచి పంపించి వేశారు. ఈ సమయంలో మీడియా ప్రతినిధులు వెళ్లి పోటోలు, వీడియోలు తీస్తుండగా జనసేన నాయకులు మీడియా ప్రతినిధులపై దుర్భాషలాడారు.